381) భూపాళం

ప॥ అపరాధిని నే నైనాను । కృపగలవారికి గపటము లేదు ॥

చ॥ సనాతనా అచ్యుత సర్వేశ్వరా । అనాదికారణ అనంతా ।
జనార్దనా అచల సకలలోకేశ్వరా । నిను మరచియున్నాడ నను దెలువవయా ॥

చ॥ పురాణపురుషా పురుషోత్తమా । చరాచరాత్మక జగదీశా ।
పరాత్పరా హరి బ్రహ్మాండనాయకా । యిరవు నీవేయట యెఱిగించగవే ॥

చ॥ దేవోత్తమా శశిదినకరనయనా । పావనచరితా పరమాత్మా ।
శ్రీవేంకటేశా జీవాంతరంగా । సేవకుడను బుద్ధిచెప్పగవలయు ॥